సాక్షి
కుమురం భీం

శనివారం : 18 : ఫిబ్రవరి : 2023



'పురం'లో నీటికష్టాలు!

వేసవికి ముందే మున్సిపాలిటీల్లో నీటి కష్టాలు మొదలయ్యాయి. పలుచోట్ల మిషన్ భగీరథ పథకం ద్వారా తాగునీటి పంపిణీ అస్తవ్యస్తంగా మారింది. 8లో▸



బాల్‌బ్యాడ్మింటన్ పోటీలు

శ్రీరాంపూర్ ప్రగతి స్టేడియంలో బాల్ బ్యాడ్మింటన్ పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. 22రాష్ట్రాల నుంచి 42బాల బాలికల జట్లు హాజరయ్యాయి. 10లో▸


గరిష్టం/కనిష్టం
34.4 /17.5

వాతావరణం

ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. మధ్యాహ్నం ఎండవేడి ఎక్కువగా ఉంటుంది. ఉక్కపోతగా అనిపిస్తుంది. రాత్రి చలి ప్రభావం తగ్గుతుంది.







శివరాత్రి శోభ

మహాశివరాత్రి వేడుకలకు ప్రధాన ఆలయాలు ముస్తాబయ్యాయి. విద్యుత్ కాంతుల్లో శివాలయాలు మెరిసిపోతున్నాయి. కాగజ్‌నగర్ మండలంలోని ఈజ్‌గాం శివమల్లన్న ఆలయం, వాంకిడి మండల కేంద్రంలోని చిక్లీవాగు ఒడ్డుపై వెలసిన కాకతీయుల కాలం నాటి ప్రసిద్ధ శివాలయం, రెబ్బెన మండలం నంబాలలోని ప్రసన్న పరమేశ్వరాలయంతోపాటు అన్ని ప్రధాన ఆలయాల్లో శనివారం అంగరంగ వైభవంగా వేడుకలు నిర్వహించనున్నారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తిచేశారు.

- వాంకిడి/రెబ్బెన/కాగజ్‌నగర్‌రూరల్

న్యూస్‌రీల్

దరఖాస్తుల ఆహ్వానం

ఆసిఫాబాద్‌అర్బన్: ఆర్థిక పునరావాస పథకం కోసం జిల్లాలోని దివ్యాంగుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వికలాంగుల సంక్షేమశాఖ జిల్లా అధికారి సావిత్రి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాకు 19 యూనిట్లు మంజూరు కాగా, ఇందు కోసం రూ.22 లక్షలు కేటాయించినట్లు పేర్కొన్నా రు. ఆసక్తి గల దివ్యాంగులు https:// tsobmms.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. వివరాలు ఆన్‌లైన్‌లో ఉంచినట్లు తెలిపారు.

శివాజీ జయంతికి కలెక్టర్‌కు ఆహ్వానం



కలెక్టర్ హేమంత్ బోర్కడేను ఆహ్వానిస్తున్న ఆరె సంఘం నాయకులు

ఆసిఫాబాద్‌రూరల్: ఛత్రపతి శివాజీ జయంతి కార్యక్రమానికి హాజరు కావాలని కోరుతూ ఆరె సంక్షేమ సంఘం నాయకులు శుక్రవారం జిల్లా కేంద్రంలో కలెక్టర్ హేమంత్ బోర్కడేను ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆరె సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బొట్టుపల్లి జయరాం మాట్లాడుతూ ఈ నెల 19న జిల్లా కేంద్రంలోని శివాజీ భవనంలో ఛత్రపతి శివాజీ జయంతి ఘనంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. జిల్లాలోని ప్రజలు అధిక సంఖ్యలో హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బిక్కాజీ, డివిజన్ ఉపాధ్యక్షుడు అన్నారావు, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, మండల అధ్యక్షుడు సంతోష్, నాయకులు మారుతి, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

బాల్యవివాహాల నిర్మూలనకు చర్యలు



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాజేశం

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలో బాల్యవివాహాల నిర్మూలనకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ రాజేశం అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో శుక్రవారం అదనపు ఎస్పీ అచ్చేశ్వర్‌రావుతో కలిసి బాల్యవివాహాల నిర్మూలనకు తీసుకోవాల్సిన చర్యలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం వివాహాలకు మంచి ముహూర్తాలు ఉన్న నేపథ్యంలో అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బాల్యవివాహాల నిషేధ చట్టం- 2006పై గ్రామ, మండల, తాలుకా స్థాయిల్లో రెవెన్యూ, పోలీసు, పంచాయతీరాజ్, ఐసీడీఎస్ సిబ్బంది సమన్వయంతో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. చైల్డ్ హెల్ప్‌లైన్ నంబర్ 1098 ప్రజలకు తెలిసేలా ప్రచారం నిర్వహించాలన్నారు. మహిళా సంఘాల ద్వారా బాల్యవివాహాలతో కలిగే నష్టాన్ని వివరించాలని సూచించారు. నిర్దేశిత వయస్సు నిండాకుండా ఎక్కడైనా వివాహాలు జరిపితే అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. సమావేశంలో డీఆర్‌డీవో సురేందర్, డీపీవో రమేశ్, డీడబ్ల్యూవో సావిత్రి, బాలల సంరక్షణ విభాగం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో రామకృష్ణ

రెబ్బెన(ఆసిఫాబాద్): ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని డీఎంహెచ్‌వో రామకృష్ణ అన్నారు. జిల్లా వైద్యాధికారి బాధ్యతలు స్వీకరించిన తర్వాత మొదటిసారిగా శుక్రవారం రెబ్బెన పీహెచ్‌సీని సందర్శించారు. ఆస్పత్రిలో ఓపీ సేవలతోపాటు వార్డు, డెలివరీ గది, ల్యాబ్‌లను పరిశీలించారు. రోగులకు అందిస్తున్న వైద్యసేవలపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సిబ్బంది నిత్యం ఆస్పత్రిలో అందుబాటులో ఉండాలని సూచించారు. అనంతరం సీఎం కేసీఆర్ జన్మదినం సందర్భంగా రోగులకు పండ్లు పంపిణీ చేశారు. పీహెచ్‌సీ ఆవరణలో మొక్క నాటారు. పీహెచ్‌సీ సిబ్బంది డీఎంహెచ్‌వోను శాలువతో సన్మానించారు. కార్యక్రమంలో వైద్యాధికారి సుజిత్, సీహెచ్‌వో వెంకటేశ్వర్లు, స్టాఫ్‌నర్స్‌లు సాహెదా, ఫార్మసిస్టు సందీప్ తదితరులు పాల్గొన్నారు.

ఏడేళ్లలో ఏడుగురు..!



జిల్లా కేంద్రంలోని డీఎంహెచ్‌వో కార్యాలయం

- జిల్లాలో తరచూ జిల్లా వైద్యాధికారుల బదిలీలు..
- వైద్యశాఖలో ఇన్‌చార్జీలే అధికం
- కొరవడుతున్న పర్యవేక్షణ
- మెరుగైన సేవలు అందక రోగులకు అవస్థలు

ఆసిఫాబాద్: ఇన్‌చార్జి అధికారులతో జిల్లాలో పరిపాలన కుంటుపడుతోంది. కుమురంభీం జిల్లా ఏర్పడి ఏడేళ్లవుతున్నా ప్రభుత్వ శాఖల్లో పూర్తిస్థాయిలో అధికారులు, సిబ్బంది లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది. జిల్లాకు కేటాయించిన అధికారులు సైతం కొంత కాలానికే బదిలీపై వెళ్తుండటంతో సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు. 2016 అక్టోబర్‌లో కుమురంభీం జిల్లా ఏర్పడగా, ఇప్పటివరకు ఏడుగురు జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారులు మారారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రి డీసీహెచ్, డీఎంహెచ్‌వో ఇన్‌చార్జీలే కొనసాగుతున్నారు. తాజాగా గత జూలైలో డీఎంహెచ్‌వోగా బాధ్యతలు స్వీకరించిన ప్రభాకర్‌రెడ్డి ఏడు నెలలే విధులు నిర్వర్తించారు. ఆయన స్థానంలో డాక్టర్ రామకృష్ణ ఇన్‌చార్జి డీఎంహెచ్‌వోగా ఈ నెల 16న బాధ్యతలు స్వీకరించారు.

పర్యవేక్షణ కరువు..

జిల్లాలో 20 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, రెండు కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రాలు, రెండు పట్టణ ఆరోగ్య కేంద్రాలు, 108 ఆరోగ్య ఉప కేంద్రాలు ఉన్నాయి. వీటి ద్వారా గ్రామీణ ప్రజలకు వైద్య సేవలందిస్తున్నారు. వైద్య శాఖలో తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న కుటుంబ సంక్షేమ కార్యక్రమాల్లో భాగంగా ప్రభుత్వాసుత్రుల్లో కాన్పులు, ఇమ్యునైజేషన్ కార్యక్రమం, జననీ సురక్ష యోజన, కేసీఆర్ కిట్లు, కుష్టు నియంత్రణ, ఎయిడ్స్ నియంత్రణ తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. వీటితోపాటు మాతాశిశు సంరక్షణ, ఆరోగ్యశ్రీ కార్యక్రమాలు అమలవుతున్నాయి. మారుమూల ప్రాంతాల్లో వైద్యులు, సిబ్బంది స్థానికంగా అందుబాటులో ఉండాల్సి ఉంటుంది. అయితే జిల్లాలో పనిచేసే వారు మంచిర్యాల, ఆసిఫాబాద్, బెల్లంపల్లి పట్టణాల నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. కొంత మంది వంతుల వారీగా విధులు నిర్వర్తిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. వీటితోపాటు పీహెచ్‌సీల్లో సిబ్బంది కొరత, రెగ్యులర్ వైద్యులు లేకపోవడంతో పల్లె ప్రజలు సరైన వైద్యసేవలు అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

పనిచేసిన కాలం..

ప్రత్యేక జిల్లాగా మారిన తర్వాత 2016 అక్టోబర్ 10న జిల్లా వైద్యాధికారిగా తొడసం చందు తొలిసారి బాధ్యతలు చేపట్టారు. ఆయన తర్వాత డాక్టర్ సుబ్బారాయుడు 2016 నవంబర్ 8 నుంచి రెండేళ్ల పాటు విధులు నిర్వహించి బదిలీ అయ్యారు. 2018 నవంబర్ 6 నుంచి డాక్టర్ టి.చందు రెండు రోజులే పనిచేశారు. అనంతరం 2018 నవంబర్ 8 నుంచి డాక్టర్ కుమ్రం బాలు బాధ్యతలు చేపట్టి కోవిడ్ సమయంలో రెండేళ్ల 8 నెలల పాటు విధులు నిర్వర్తించారు. ఆయనపై పలు ఆరోపణలు రావడంతో సరెండర్ చేశారు. రెండు రోజులపాటు డాక్టర్ సుధాకర్ నాయక్ ఇన్‌చార్జిగా వ్యవహరించారు. 2021 జూలై 7 నుంచి డాక్టర్ మనోహర్ 2022 జూలై 3 వరకు పనిచేశారు. 2022 జూలై 4న డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి డీఎంహెచ్‌వోగా బాధ్యతలు స్వీకరించారు. ఏడు నెలల పాటు పనిచేసిన ఆయన ఉన్నత చదువుల కోసం వెళ్తుండటంతో మంచిర్యాల డీఐవోగా పనిచేస్తున్న డాక్టర్ రామకృష్ణ గురువారం డీఎంహెచ్‌వోగా బాధ్యతలు అప్పగించారు. ఇలా ఏడేళ్లలో ఏడుగురు ఇన్‌చార్జి డీఎంహెచ్‌వోలను మార్చారు. బాధ్యతలు స్వీకరించిన వారు కుదురుకోవడానికే ఆరు నెలల వరకు సమయం పడుతుంది. జిల్లాపై అవగాహన రాగానే బదిలీ కావడంతో ఇక్కడ సమస్యలు పరిష్కారం కావడం లేదు. ప్రజాజీవితంలో కీలకమైన వైద్యశాఖలో రెగ్యులర్ అధికారులు లేకపోవడం, ఇక్కడ పనిచేసే అధికారులను తరచూ బదిలీలు చేయడం సరికాదని సర్వత్రా విమర్శలు వస్తున్నాయి.

ప్రైవేట్‌కు దీటుగా సర్కారు బోధన



తరగతి గదిలో కలెక్టర్ హేమంత్ బోర్కడే, అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, ఎమ్మెల్యే కోనప్ప

- కలెక్టర్ హేమంత్ బోర్కడే
- కాగజ్‌నగర్‌లో మన ఊరు- మన బడి పాఠశాల ప్రారంభం

కాగజ్‌నగర్‌టౌన్: ప్రభుత్వ పాఠశాలల్లో ప్రైవేటుకు దీటుగా విద్యాబోధన సాగుతుందని కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. మన ఊరు- మన బడి కార్యక్రమంలో భాగంగా రూ.32.74 లక్షలతో అభివృద్ధి చేసిన కాగజ్‌నగర్ పట్టణంలోని సర్‌సిల్క్‌లో గల మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలను అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, ఎమ్మెల్యే కోనేరు కోనప్పతో కలిసి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మన ఊరు- మన బడి కార్యక్రమం ద్వారా పాఠశాలల్లో వసతులు కల్పిస్తున్నామన్నారు. మొదటి విడతలో జిల్లాలో 251 పాఠశాలలను ఎంపిక చేశామని పేర్కొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యనందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్, మున్సిపల్ చైర్మన్ సద్దాం హుస్సేన్, మార్కెట్ కమిటీ చైర్మన్ కాసం శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ అంజయ్య, తహసీల్దార్ ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.

సమీకృత కలెక్టరేట్ భవనం పనులు పూర్తిచేయాలి

ఆసిఫాబాద్‌అర్బన్: సమీకృత కలెక్టరేట్ నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. జిల్లా కేంద్రంలో శుక్రవారం సమీకృత కలెక్టరేట్ నిర్మాణ పనులను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్మాణ పనులు తుదిదశలో ఉన్నాయన్నారు. ఆయా శాఖలకు కేటాయించిన కార్యాలయాల్లో విద్యుత్, ఫర్నీచర్ ఏర్పాటు పనులతోపాటు మిగిలిన పనులను వేగవంతం చేయాలన్నారు. మహిళా ఉద్యోగుల పిల్లలతో ఉండేందుకు వీలుగా ప్రత్యేక గది ఏర్పాటు చేస్తామని, పిల్లల పర్యవేక్షణకు శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అధికారులను నియమిస్తామని తెలిపారు. ఆవరణలో ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేందుకు ఉద్యానవనం ఏర్పాటు చేసి, పూలు, నీడనిచ్చే మొక్కలు నాటాలని ఆయన సూచించారు.

ఈజ్‌గాంలో జాతర షురూ

- ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ సురేశ్‌కుమార్



అభిషేకం చేస్తున్న ఎస్పీ సురేశ్‌కుమార్, జెడ్పీ వైస్‌చైర్మన్ కృష్ణారావు

కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ మండలంలోని ఈజ్‌గాం శివమల్లన్న ఆలయంలో మహాశివరాత్రి సందర్భంగా జాతర ప్రారంభమైంది. శుక్రవారం వేద పండితులు ముద్దు నరహరి శర్మ, ఆలయ అర్చకులు సంతోష్ శర్మ ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకాలు, అర్చనలు, పుణ్యాహవచనం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం ఆలయంలో శివపార్వతుల కల్యాణం, రథోత్సవం నిర్వహించనున్నారు. కాగా ఎస్పీ సురేశ్‌కుమార్, జెడ్పీ వైస్‌చైర్మన్ కోనేరు కృష్ణారావు ఆలయాన్ని సందర్శించారు. స్వామి వారికి అభిషేకాలు నిర్వహించారు. జాతర బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ఈవో వేణుగోపాల్ గుప్తా, చైర్మన్ ఇందారపు రాజేశ్వర్‌రావు, సీఐ నాగరాజు, ఎస్సై జగదీశ్, ఎంపీటీసీ అమిత్ దాస్, సర్పంచ్ మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

టీజీబీలో చోరీకి విఫలయత్నం

- తెరుచుకోని లాకర్.. డబ్బులు భద్రం
- సీసీ కెమెరా సర్వర్ ఎత్తుకెళ్లిన దుండగులు



బ్యాంక్‌లోకి వెళ్లేందుకు దొంగలు చేసిన కన్నం

చింతలమానెపల్లి(సిర్పూర్): చింతలమానెపల్లి మండలం రవీంద్రనగర్‌లోని తెలంగాణ గ్రామీణ బ్యాంక్(టీజీబీ)లో గురువారం రాత్రి చోరీకి దొంగలు విఫలయత్నం చేశారు. బ్యాంకు వెనుకవైపు నుంచి గోడకు మనిషి లోపలికి వెళ్లేంత రంధ్రం చేశారు. లోపలికి చొరబడి గదిలో ఉన్న లాకర్ తెరిచేందుకు ప్రయత్నించారు. గ్యాస్‌కట్టర్ సహాయంతో లాకర్‌ను తెరిచేందుకు ప్రయత్నించి ఒక లేయర్ తొలగించినా మరో లేయర్ తొలగించలేకపోయారు. దీంతో ఎలాంటి నగదు చోరీకి గురి కాలేదు. బ్యాంకులో అమర్చిన సీసీ కెమెరాల సర్వర్‌ను దుండగులు ఎత్తుకెళ్లారు. శుక్రవారం పోలీసులు విచారణ జరిపారు. ఎస్పీ సురేష్‌కుమార్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. విచారణ చేపట్టి దొంగలను త్వరలోనే పట్టుకుంటామని తెలిపారు. కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్ ఆధ్వర్యంలో సీఐ బుద్దే స్వామి, ఎస్సై విజయ్‌కుమార్ సాక్ష్యాలు సేకరించారు. పోలీసు జాగిలాలు బ్యాంకు నుంచి బాలాజీ అనుకోడ గ్రామం సమీపంలోని వంతెన వద్దకు చేరుకుని ఆగిపోయాయి.

'మాలీలను ఎస్టీ జాబితాలో చేర్చొద్దు'



నినాదాలు చేస్తున్న ఆదివాసీ నాయకులు

కౌటాల: మాలీలు, వాల్మీకి, బోయ కులస్తులతోపాటు మరో 11 కులాలను ఎస్టీ జాబితాలో చేర్చొద్దని డీసీఎంఎస్ వైస్ చైర్మన్, తుడుందెబ్బ రాష్ట్ర నాయకులు కుమురం మాంతయ్య, మన్నెవార్ సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు మెర్పల్లి బ్రహ్మయ్య అన్నారు. కౌటాల మండల కేంద్రంలోని ఆదివాసీ భవనంలో శుక్రవారం ఆదివాసీ సంఘాల అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పలు కులాలను ఎస్టీ జాబితాలో చేర్చుతామని తీర్మానించడం సమంజసం కాదన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా తెలంగాణలో లంబాడాలను ఎస్టీ జాబితాలో చేర్చడంతోనే ఆదివాసీలకు అన్యాయం జరుగుతోందన్నారు. స్థానిక ఎమ్మెల్యే ఇతర కులాలను ఎస్టీ జాబితాలో చేర్చాలని సీఎం దృష్టికి తీసుకెళ్లడం బాధాకరమని పేర్కొన్నారు. శాసన సభలో చేసిన తీర్మానాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్‌తో ఈ నెల 20న ఉట్నూర్‌లో చేపట్టిన ఐటీడీఏ ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో మన్నెవార్ సేవా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పారిపెల్లి పోశం, గిరిజన సర్పంచులు మడావి రేణుక, మెర్పల్లి సునంద, ఉర్వెత్ జీజాబాయి, ఎడ్ల శారద, రెడ్డి శంకర్, సోయం సురేష్, పోరేతు చరందాస్, నాయకులు మెర్పల్లి సదాశివ్, బుర్స నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

గడువులోగా ఖర్చయ్యేనా..?

- గ్రామీణ ప్రాంతాల్లోని మట్టిరోడ్లకు మహర్దశ
- ఉపాధిహామీ పథకంలో రూ.23.51 కోట్లు మంజూరు
- మార్చి 21లోగా ఖర్చు చేయాల్సిందే..
- గతేడాది రూ.18.10 కోట్లు వృథా



పెంచికల్‌పేట్ ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధిహామీ రోడ్ల నిర్మాణంపై సమావేశం (ఫైల్)

ఆసిఫాబాద్‌అర్బన్: పల్లెల్లోని అంతర్గత రహదారులు సీసీ రోడ్లుగా మారనున్నాయి. ఉపాధిహామీ పథకం కింద 2022- 23 ఆర్థిక సంవత్సరానికి గాను జిల్లాకు రూ.23.51 కోట్లు మంజూరు చేస్తూ గ్రామీణాభివృద్ధి శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో మట్టిరోడ్లకు మహర్దశ పట్టనుంది. అయితే మార్చి 21లోగా పనులు పూర్తిచేయాల్సి ఉండటంతో గడువులోగా నిధులు ఖర్చయ్యేనా అనే అనుమానం వ్యక్తం అవుతోంది. సకాలంలో నిధులు వినియోగించకపోవడంతో గతేడాది రూ.18.10కోట్లు వెనక్కి వెళ్లాయి.

422 సీసీ రోడ్లు..

2022- 23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఉపాధిహామీ పథకం మెటీరియల్ కాంపోనెంట్ కింద జిల్లాలో 422 సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.23.51 కోట్లు మంజూరయ్యాయి. ఆసిఫాబాద్ నియోజకవర్గం పరిధిలో 211 పనులకు రూ.8.48 కోట్లు, సిర్పూర్ నియోజకవర్గం పరిధిలో 211 పనులకు రూ.15.03 కోట్లు ఖర్చు చేయాల్సి ఉంది. జిల్లాలోని 15 మండలాల్లో పంచాయతీకి 2, 3 పనుల చొప్పున ఎంపిక చేశారు. ఇవే కాకుండా మరికొన్ని పనుల కోసం మరో రూ.15 కోట్లతో ప్రతిపాదనలు పంపే అవకాశం ఉందని సమాచారం. పనులు చేపట్టేందుకు పంచాయతీల నుంచి తీర్మానాలను ఇంజనీరింగ్ అధికారులకు అందించాలి. ఉపాధిహామీ పథకంలో కూలీలు, పని నిష్పత్తి ఆధారంగా ఏటా కేంద్రం నిధులు మంజూరు చేస్తుంది. ఇదివరకే పంచాయతీల్లో అవసరమైన రోడ్లు, మురుగు కాలువల నిర్మాణానికి నివేదికలు సమర్పించారు. అనంతరం నిధులు పంచాయతీల ఖాతాల్లో జమ చేస్తారు. పూర్తిచేసిన పనులకు సంబంధించిన బిల్లులు సర్పంచులకే చెల్లించాల్సి ఉంటుంది.

గతేడాది రూ.18.10కోట్లు వెనక్కి..

ఉపాధిహామీ కింద రహదారుల అభివృద్ధి కోసం 2021- 22 ఆర్థిక సంవత్సరంలో రూ.41.63 కోట్లు మంజూరయ్యాయి. ఈ నిధులతో 1,024 పనులు చేపట్టాల్సి ఉండగా, కేవలం 618 పనులకు రూ.23.53 కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. మిగిలిన రూ.18.10 కోట్లు నిరుపయోగంగా వెనక్కి వెళ్లాయి. ఉపాధిహామీ నిధులతో చేపట్టే సీసీ రోడ్ల పనులు మార్చి 21లోగా పూర్తి చేయాల్సి ఉంటుంది. ఆర్థిక సంవత్సరం చివరి సమయంలోనే కేంద్రం నిధులు మంజూరు చేస్తోంది. గడువులోగా పనులు పూర్తికాక నిధులు వెనక్కి వెళ్తున్నాయి. ఒకేసారి వందల పనులు మంజూరు కావడంతో ఇంజనీరింగ్ అధికారుల పర్యవేక్షణ కష్టసాధ్యమవుతోంది. వేగంగా పనులు పూర్తి చేయాలనే హడావుడిలో నాణ్యత గురించి పట్టించుకోవడం లేదనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. రోడ్లు, డ్రెయినేజీల్లో నాణ్యత పాటించకపోవడంతో నిర్మించిన నెలలకే పగుళ్లు తేలి నిధులు నీటిపాలవుతున్నాయి. ఈ ఏడాది కూడా గడువు దగ్గరగా ఉండటంతో ముందస్తు ప్రణాళికలతో పనులను వేగవంతం చేయాల్సి ఉంది.

గడువులోగా పూర్తిచేస్తాం

ఉపాధి హామీ పథకం ద్వారా మంజూరైన నిధులను గడువులోగా పూర్తిస్థాయిలో వినియోగిస్తాం. సీసీ రోడ్లను గడువులోగా పూర్తి చేసేందుకు పక్కా ప్రణాళిలు రూపొందించాం. ఆర్థిక సంవత్సరం దాటితే ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంది. పనుల్లో నాణ్యత ఉండేలా చర్యలు తీసుకుంటాం.

- రామ్మోహన్‌రావు, పంచాయతీరాజ్ ఈఈ

క్లుప్తంగా

'అలవెన్సుల లెక్క తేల్చాలి'

శ్రీరాంపూర్: బొగ్గు గని కార్మికుల 11వ వేతన ఒప్పందానికి సంబంధించిన అలవెన్సుల లెక్క తేల్చాలని బీఎంఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ పేరం రమేశ్ కోలిండియా యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఏరియా వర్క్‌షాప్‌లో నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. వేజ్‌బోర్డు సభ్యుడు లక్ష్మారెడ్డి కృషి ఫలితంగా 19 శాతం మినిమం గ్యారెంటీ బెనిఫిట్‌పై ఒప్పందం జరిగిందన్నారు. ఇంకా మిగిలిన అలవెన్సులు, సామాజిక భద్రత, ప్రోత్సాహకాలు, లీవులు, సెలవులపై ఒప్పందం జరుగాల్సి ఉందన్నారు. దీన్ని నిరసిస్తూ ఈ నెల 19, 20, 21 తేదీల్లో గనులపై నిరసనలు, 21న జీఎం కార్యాలయాల ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆ యూనియన్ నాయకులు కాదాసి భీమయ్య, గోవతి సందీప్, మంద సత్తయ్య, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని ఏసీసీ సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రామకృష్ణాపూర్‌లోని రాంనగర్‌కు చెందిన తొగరు రవి (45) మృతి చెందినట్లు ఎస్సై ఉదయ్‌కిరణ్ తెలిపారు. జైపూర్ పవర్ ప్లాంటులో కాంట్రాక్టు లేబర్‌గా పనిచేస్తున్న రవి శుక్రవారం బైక్‌పై మంచిర్యాలకు వచ్చి వెళ్తుండగా ఏసీసీ సమీపంలో వెనుక నుంచి అతివేగంగా వచ్చిన ఐచర్ వ్యాన్ ఢీ కొట్టింది. దీంతో తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య సరోజన, కుమారుడు, కూతురు ఉన్నారు. వ్యాన్ డ్రైవర్ అంజయ్యను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రూ.లక్ష జరిమానా చెల్లింపు

దండేపల్లి: మండలంలోని తానిమడుగు గ్రామానికి చెందిన భూక్యా రాంచందర్ బైండోవర్ ఉల్లంఘించినందుకుగానూ ఇటీవల దండేపల్లి తహసీల్దార్ హన్మంతరావు రూ.లక్ష జరిమానా విధించినట్లు లక్సెట్టిపేట ఎక్సైజ్ సీఐ బాబా, ఎస్సై రాబర్ట్ తెలిపారు. జరిమానా మొత్తం సదరు వ్యక్తి శుక్రవారం చెల్లించినట్లు వారు పేర్కొన్నారు.

ఒకరికి మూడేళ్ల జైలు

ఆదిలాబాద్‌టౌన్: గంజాయి కేసులో ఒకరికి మూడేళ్ల జైలు, రూ.5వేల జరిమానా విధిస్తూ జిల్లా మొదటి అదనపు జడ్జి మాధవీకృష్ణ తీర్పు చెప్పారు. లైజన్ అధికారి జీ పండరి తెలిపిన వివరాల ప్రకారం.. 2020 జూలై 4న పట్టణంలోని ఖుర్షీద్‌నగర్‌కు చెందిన నజర్ అలీఖాన్ అదే కాలనీలో గంజాయి విక్రయిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. దీంతో టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో అప్పటి ఎస్సై మొబీన్ కేసు నమోదు చేశారు. పీపీ మధుకర్ ఎనిమిది మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా నేరం రుజువైంది. ఈ మేరకు జడ్జి తీర్పునిచ్చినట్లు కోర్టు డ్యూటీ ఆఫీసర్ ఎం.శ్రీనివాస్, లైజన్ అధికారి వివరించారు.

పురంలో నీటి కష్టాలు!

జిల్లాలో వేసవికి ముందే మున్సిపాలిటీల్లో నీటి కష్టాలు మొదలయ్యాయి. మిషన్ భగీరథ పథకం ద్వారా ఇంటింటికీ తాగు నీరు అందిస్తున్నామని ప్రభుత్వం చెబుతుండగా, క్షేత్రస్థాయిలో పరిస్థితి ఇందుకు విరుద్ధంగా ఉంది. జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల్లో తాగునీటి నిర్వహణ అస్తవ్యస్తంగానే ఉంది. రోజువిడిచి రోజు నీటిని సరఫరా చేస్తున్నారు. ఇక మున్సిపాలిటీల్లోని శివారు కాలనీల పరిస్థితి దారుణంగా ఉంది. ఆయా కాలనీలకు ట్యాంకర్లే దిక్కయ్యాయి. ట్యాంకర్ వచ్చిన రోజే నీళ్లు పట్టుకోవాల్సిన పరిస్థితి. ట్యాంకర్ రాకుంటే దూర ప్రాంతాల నుంచి తెచ్చుకోవాల్సిందే. జిల్లాలోని ఆయా మున్సిపాలిటీల్లో శుక్రవారం 'సాక్షి' విజిట్ చేయగా పలు విషయాలు వెలుగులోకి వచ్చాయి.

- మున్సిపాలిటీల్లో వేసవికి ముందే సమస్య
- రోజు విడిచి రోజు నీటి సరఫరా
- శివారు కాలనీలకు ట్యాంకర్లే దిక్కు

సాక్షి విజిట్



ఏసీసీ ప్రాంతంలో ట్యాంకర్ ద్వారా తాగునీరు సరఫరా చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

మంచిర్యాలటౌన్: తలాపునే గోదావరి ఉన్నా.. ఎల్లంపల్లి ప్రాజెక్టులో నిండా నీరున్నా.. పక్కనే ఉన్న మంచిర్యాల మున్సిపాలిటీ ప్రజలకు మాత్రం తాగునీటి గోస తప్పడం లేదు. ఇటీవలి వరకు మూడు నుంచి ఐదు రోజుకోసారి తాగునీరు సరఫరా చేశారు. ప్రస్తుతం రోజు విడిచి రోజు సరఫరా చేస్తున్నారు. మిషన్ భగీరథ పనులు జరుగుతున్నందువల్ల ప్రతీరోజు నీటి సరఫరా చేయలేకపోతున్నామని అధికారులు పేర్కొంటున్నా రెండున్నరేళ్లుగా ఇదే పరిస్థితి ఉందని ప్రజలు వాపోతున్నారు. వచ్చిన నీరైనా స్వచ్ఛతగా లేకపోవడంతో మినరల్ వాటర్ కొనుగోలు చేస్తున్నామని వారు పేర్కొన్నారు. మంచిర్యాల మున్సిపాలిటీ కార్యాలయంలో సైతం మున్సిపల్ నుంచి సరఫరా చేసే తాగునీటిని వినియోగించకుండా వాటర్ ప్లాంట్ల నుంచి తెప్పించుకుంటున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. జిల్లా కేంద్రంలో గతంలో పది వరకు ఉన్న మినరల్ వాటర్ ప్లాంట్ల సంఖ్య ప్రస్తుతం 20కి చేరుకుంది.

శివారు కాలనీలకు అందని తాగునీరు

మంచిర్యాల మున్సిపాలిటీలో 25 వేల వరకు నివాసాలు ఉండగా 14,742 నల్లా కనెక్షన్లు ఉన్నాయి. ప్రతీరోజు 14.85 మిలియన్ లీటర్ల నీటిని సరఫరా చేయాల్సి ఉంది. హాజీపూర్ మండలం ముల్కల్ల వద్ద గోదావరి నదిపైన పంప్‌హౌజ్ ఏర్పాటు చేసి అక్కడి నుంచే తాగునీటిని అందించాల్సి ఉంది. కానీ ఎల్లంపల్లి ప్రాజెక్టు వద్ద మిషన్ భగీరథ ద్వారా తాగునీటిని సరఫరా చేసేందుకు ఇంటెక్‌వెల్‌ను ఏర్పాటు చేసి నీటిని శుద్ధి చేసి అందిస్తున్నారు. మిషన్ భగీరథ పనులు పూర్తి కాకపోవడంతో మంచిర్యాలకు పూర్తిస్థాయిలో తాగునీరు సరఫరా కావడం లేదు. దీంతో మున్సిపల్ వాటర్ ట్యాంకుల ద్వారా తిలక్‌నగర్, రాజీవ్‌నగర్, గోపాల్‌వాడ, మజీద్‌వాడ, రంగంపేట్, ఆండాళమ్మకాలనీ, ఏసీసీ, వడ్డెర కాలనీ, తదితర ప్రాంతాలకు నీటిని ద్వారా సరఫరా చేస్తున్నారు. అవికూడా సరిపడా అందించడంలేదని కాలనీవాసులు వాపోతున్నారు.

అలంకారప్రాయంగా ట్యాంకులు

నస్పూర్: పట్టణ పరిధిలోని పలు కాలనీల్లో మిషన్ భగీరథ నీటి సరఫరాలో తరచూ అంతరాయం ఏర్పడుతోంది. పట్టణ పరిధిలో 17,248 నల్లా కలెక్షన్లు వేసినట్లు అధికారులు తెలిపారు. సీసీసీ లోని గాంధీనగర్, విలేజ్ శ్రీరాంపూర్, ఠాగూర్ నగర్, ఏరియాల్లో తాగునీటి సరఫరాలో తరచూ అంతరాయం ఏర్పడుతోంది. ఇంతకు ముందు పట్టణంలోని పలు కాలనీలకు సింగరేణి సంస్థ గోదావరి నీటిని సరఫరా చేసేది. ఆయా కాలనీలకు మిషన్ భగీరథ నీరు సరఫరా అవుతుండడంతో సింగరేణి సంస్థ గోదావరి నీటి సరఫరాను నిలిపి వేసింది. మిషన్ భగీరథ నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతుండడంతో


విలేజ్ శ్రీరాంపూర్‌లో నిరుపయోగంగా ట్యాంకు

కాలనీ వాసులు మినరల్ వాటర్ కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీనిపై మిషన్ భగీరథ ఏఈ అబ్రహాంను సంప్రదించగా పట్టణంలో హైవే విస్తరణ పనుల వల్ల పలుచోట్ల పైపులైన్లు దెబ్బతినడంతో నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతోందన్నారు.

చేతిపంపే ఆధారం

చెన్నూర్: చెన్నూర్ మున్సిపాలిటీలో మిషన్ భగీరథ నీరు కొందరికే సరఫరా అవుతోంది. దీంతో ఆయా కాలనీల ప్రజలు చేతిపంపులు, బతుకమ్మ వాగు నల్లాలు, బోరు నీటిపైనే ఆధారపడి కాలం వెళ్లదీస్తున్నారు. నాయీ బ్రాహ్మణ వీధిలో ఒకవైపు పైపులైన్లు వేసిన అధికారులు ఒకవైపు మాత్రమే నల్లా కనెక్షన్లు ఇచ్చారు. దీంతో ఆ కాలనీవాసులు చేతిపంపును ఆశ్రయిస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ లోపం, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం కారణంగా మున్సిపాలిటీలోని నాయీ బ్రాహ్మణ వీధి, మహంకాళివాడ, శివాలయం వీధి, పద్మశాలి కాలనీ, ఎమ్మెల్యే కాలనీ, కొత్తగూడెం కాలనీలకు మిషన్ భగీరథ నీరు సరఫరా కావడంలేదు. బతుకమ్మ వాగు నుంచి వచ్చే నీటికి గతంలోనే 710 నల్లా కనెక్షన్లు ఏర్పాటు చేశారు. అవే నీటిని ఆయా కాలనీల ప్రజలు వినియోగిస్తున్నారు. మిషన్ భగీరథ పథకం ద్వారా ప్రభుత్వం పది ఓవర్‌హెడ్ ట్యాంకులను నిర్మించింది. 7,010 నల్లా కనెక్షన్లు ఏర్పాటు చేసింది. ఎస్‌బీఐ వద్ద గల ట్యాంక్‌తో పాటు ఎమ్మెల్యే కాలనీ, ఎంపీడీవో కార్యాలయం వెనుకాల ఉన్న ట్యాంకులకు నీటి కనెక్షన్ ఇవ్వడం మరిచారు. నల్లగొండ పోచమ్మ వాడలో బతుకమ్మ వాగు నల్లా కనెక్షన్లు సైతం లేకపోవడంతో చేతిపంపులపైనే ఆధారపడుతున్నామని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చేతిపంపుల నుంచి వచ్చే నీరు ఉప్పగా ఉండడంతో మినరల్ వాటర్ కొనుగోలు చేస్తున్నామని వారు పేర్కొన్నారు. ఇప్పుడే పరిస్థితి ఇలా ఉంటే రానున్న వేసవిని తలచుకుని ఆందోళన చెందుతున్నారు. అధికారులు దృష్టి సారించి ఇంటింటికీ మిషన్ భగీరథ నీరు అందేలా కృషి చేయాలని కోరుతున్నారు.


చేతిపంపు వద్ద మహిళలు

పూర్తిస్థాయిలో అందని తాగునీరు

బెల్లంపల్లి: బెల్లంపల్లి పుర ప్రజలకు నీటికష్టాలు తప్పడంలేదు. మున్సిపాలిటీలో 34 వార్డుల్లో 4,560 నల్లా కనెక్షన్‌లు ఉన్నాయి. ప్రస్తుతం వీటి ద్వారా నీటిని సరఫరా చేస్తున్నా పూర్తిస్థాయిలో అందించలేకపోతున్నారు. ప్రతీరోజు 10.6 మిలియన్ లీటర్ల నీటిని అందించాల్సి ఉన్నా మున్సిపాలిటీ పరంగా 4.4 మిలియన్ లీటర్లు, సింగరేణి తరఫున 4.6 మిలియన్ లీటర్లు సరఫరా చేస్తున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. కానీ వాస్తవ పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి.


కన్నాల బస్తీలో నిర్మించిన ఓవర్ హెడ్ ట్యాంకు

భగీరథ కనెక్షన్లు ఇచ్చినా...

మిషన్ భగీరథ పథకం ద్వారా మున్సిపాలిటీలో కొత్తగా 6,000 నల్లా కనెక్షన్లు ఇచ్చినట్లు రికార్డులు చెబుతున్నాయి. అయినా పాత పైపులైన్ ద్వారానే మిషన్ భగీరథ నీటిని సరఫరా చేస్తుండటం గమనార్హం. కొత్త నల్లాలకు నీటి సరఫరా జరగకపోవడతో తాగునీటికోసం ప్రజలు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి.

ప్రతీరోజు సరఫరా చేయాలి



పక్కనే గోదావరి ఉన్నా పట్టణ ప్రజలు తాగునీటికి మాత్రం ఇబ్బందులు పడాల్సి వస్తుంది. మొన్నటి వరకు మూడు నాలుగు రోజులకోసారి నీటిని సరఫరా చేసినా ప్రస్తుతం రోజు విడిచి రోజు సరఫరా చేస్తున్నారు. ఎండాకాలం వస్తున్న దృష్ట్యా ప్రతీరోజు సరిపడా తాగునీరు అందేలా చూడాలి. – ఎస్.మంజుల, గృహిణి, మంచిర్యాల

నీళ్లు రావడం లేదు



ఇంటి ముందు మిషన్ భగీరథ పైపు వేసిండ్లు. కనెక్షన్ ఇవ్వలేదు. ముందు లైన్ వాళ్లకు నీళ్లు వస్తున్నయ్. మేము చేతిపంపు వద్ద నుంచి నీళ్లు తెచ్చుకుంటున్నాం. రోడ్డు పక్కనుంచి వేసిన పైపులు కొన్నిచోట్ల పగిలిపోయాయి. అధికారులు స్పందించి మాకు మిషన్ భగీరథ నీరు సరఫరా చేయాలి.

– జింపాల శంకరక్క, నాయీ బ్రాహ్మణవీధి, చెన్నూర్

రోజువిడిచి రోజు సరఫరా



మంచిర్యాల మున్సిపాలిటీలో మిషన్ భగీరథ పనులు జరుగుతున్న సమయంలో తాగునీటికి కొంత ఇబ్బంది ఉండేది. ప్రస్తుతం అన్నిపైపులను వేయడంతో పాటు నీటి సరఫరాను మెరుగుపరిచాం. రోజు విడిచి రోజు తాగునీటిని అందిస్తున్నాం. నీటి సరఫరా కాని కొన్ని ప్రాంతాలకు మున్సిపల్ ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తున్నాం.

– మధుకర్, మంచిర్యాల మున్సిపల్ డీఈ

నెల రోజుల్లో సమస్య పరిష్కరిస్తాం

మున్సిపాలిటీలోని కొన్ని ట్యాంకులకు కనెక్షన్లు ఇవ్వడంలో ఆలస్యం జరిగింది. ఇప్పటి వరకు 7 వేలకు పైగా నల్లా కనెక్షన్లు ఇచ్చాం. పూర్తిస్థాయిలో నీరు సరఫరా కావడంలేదు. ఎమ్మెల్యే కాలనీ, ఎస్‌బీఐ బ్యాంక్ ఎదుట, ఎంపీడీవో కాలనీలో ఉన్న ట్యాంకులకు త్వరలోనే కనెక్షన్లు ఇస్తాం. నెల రోజుల్లో వంద శాతం నీటి సరఫరా అయ్యే విధంగా చర్యలు తీసుకుంటాం.

– వెంకటేశ్, మిషన్ భగీరథ డీఈ, చెన్నూర్

'కార్మికుడిని విధుల్లోకి తీసుకోవాలి'

నస్పూర్: భూపాలపల్లి ఏరియా పరిధిలోని కేటీకే 8 ఇంక్లైన్‌లో జరిగిన మిస్‌ఫైర్‌లో క్రమశిక్షణ చర్యల కింద డిస్మిస్ చేసిన కార్మికుడు సాదుల ప్రకాశ్‌ని విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ శ్రీరాంపూర్ ఏరియా మైనింగ్ స్టాఫ్ అసోసియేషన్ నాయకులు శుక్రవారం శ్రీరాంపూర్ ఏరియా జీఎం కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రకాశ్‌ని అకారణంగా డిస్మిస్ చేయడమే కాకుండా మైనింగ్ సర్దార్ బత్తుల వెంకటేశ్వర్లు, ఓవర్‌మెన్ శ్రీకాంత్‌లను డీ ప్రమోట్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేయడం అన్యాయమన్నారు. అనంతరం జీఎం సంజీవరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ల్యాగాల శ్రీనివాస్, అన్వేశ్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, వంగరి రాజేశ్వర్‌రావు, మల్లారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


జీఎంకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

డిస్మిస్ చేయడం చట్ట వ్యతిరేకం

బెల్లంపల్లి: కార్మికులను విధుల నుంచి డిస్మిస్ చేయడం చట్ట వ్యతిరేకమని జేఏసీ నాయకులు అన్నారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ముందస్తుగా నోటీసులు జారీ చేయకుండా డిస్మిస్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అక్రమ డిస్మిస్‌లను వెంటనే రద్దు చేయాలని, లేనిపక్షంలో ఈ నెల 20 నుంచి సింగరేణి వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు పార్వతి రాజిరెడ్డి, ఎండి చాంద్‌పాషా, దేవి సత్యం, మణిరాంసింగ్, నీరటి రాజన్న, అంబాల మహేందర్, మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన దేహదారుఢ్య పరీక్షలు


ఎత్తు పరిశీలిస్తున్న ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి


షార్ట్‌పుట్ వేస్తున్న అభ్యర్థి

- తుది రాత పరీక్షకు 876 మంది అర్హత

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ మైదానంలో నిర్వహిస్తున్న రెండో విడత ఎస్సై, కానిస్టేబుల్ అభ్యర్థుల దేహదారుఢ్య పరీక్షలు శుక్రవారం ముగిశాయి. 2,696 మందికి 2,350 హాజరు కాగా 876 మంది అన్ని పరీక్షల్లో ఉత్తీర్ణులై తుది రాత పరీక్షకు అర్హత సాధించినట్లు ఎస్పీ డి.ఉదయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. తుది రాత పరీక్షలో మంచి మార్కులు సాధించిన వారికే ఉద్యోగావకాశాలు ఉంటాయని పేర్కొన్నారు. అదనపు ఎస్పీలు శ్రీనివాస్‌రావ్, రాములునాయక్, సమయ్‌జాన్‌రావ్, ఆర్.వెంకటేశ్వర్లు, డీఎస్పీలు నాగేందర్, ఉమేందర్, పోతారం శ్రీనివాస్, ఉమామహేశ్వర్‌రావ్, సిబ్బంది ఉన్నారు.

ఇళ్ల పట్టాలు అందజేత

బెల్లంపల్లి: తాండూర్ మండలం మాదారం 5 ఇంక్లైన్‌కు చెందిన 11 మంది లబ్ధిదారులకు శుక్రవారం బెల్లంపల్లిలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం జారీ చేసిన జీవో 58, 59 కింద ఎంపిక చేసిన లబ్ధిదారులకు పట్టాలు అందించామన్నారు. పేదలకు ఇళ్లపట్టాలు ఇవ్వడానికి ముఖ్యమంత్రి కేసీఆర్ చర్యలు తీసుకుంటున్నారని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి ఆర్డీవో కె.శ్యామలాదేవి, ఎంపీపీ ప్రణయ్‌కుమార్, తహసీల్దార్ కవిత, సర్పంచ్ గాజుల సునీత, అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.


ఇళ్ల పట్టాలు అందిస్తున్న ఎమ్మెల్యే చిన్నయ్య

రాష్ట్ర పరిశీలకుల బృందం పర్యటన

జన్నారం: మండలంలోని వివిధ గ్రామాల్లో శుక్రవారం రాష్ట్ర పరిశీలకుల బృందం పర్యటించింది. పొనకల్, బాదంపల్లిలో ప్రాథమిక పాఠశాల, బాదంపల్లి, జన్నారంలో బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలు, రేండ్లగూడ ప్రాథమికోన్నత పాఠశాలలను సందర్శించారు. ప్రాథమిక పాఠశాలలో జరుగుతున్న తొలిమెట్టు, ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థుల సంసిద్ధతపై ఆరా తీశారు. విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులు, స్లిప్ టెస్టులు, పరిశీలించారు. ఉపాధ్యాయులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పరిశీలకులు హన్మండ్లు, చారి, ఎంఈవో విజయ్‌కుమార్, ప్రధానోపాధ్యాయులు విద్యాసాగర్, సంతోశ్, జనార్దన్ పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఉపాధి యూనిట్ల కేటాయింపు

మంచిర్యాలటౌన్: జిల్లాలోని దివ్యాంగులకు ఆర్థిక పునరావాస పథకం కింద రూ.16.50 లక్షల విలువైన 28 యూనిట్లను కేటాయించినట్లు జిల్లా సంక్షేమ అధికారి చిన్నయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన దివ్యాంగులు ఆన్‌లైన్‌లో http://tsobmms.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా ఈ నెల 28లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. సదరం సర్టిఫికెట్‌లో 40 శాతం దివ్యాంగత్వం ఉండాలని, 21 నుంచి 55 ఏళ్లలోపు వయస్సు, వార్షికాదాయం గ్రామీణ ప్రాంతాల వారికి రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతల వారికి రూ.2 లక్షలలోపు ఉండాలన్నారు. ధ్రువీకరణ పత్రాలు, మూడు పాస్ ఫొటోలతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు టోల్‌ఫ్రీ నంబర్ 155326 నంబరులో సంప్రదించాలని సూచించారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

మంచిర్యాలక్రైం: పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన మహిళ శుక్రవారం మృతి చెందినట్లు ఎస్సై ఉదయ్‌కిరణ్ తెలిపారు. పట్టణంలోని రంగంపేటకు చెందిన పొల్కా పోసు (42) భర్త రాయమల్లు 20 ఏళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. అప్పటి నుంచి సదరు మహిళ మానసిక పరిస్థితి బాగాలేకపోవడంతో కుమారుడు సురేశ్ వద్దే ఉంటోంది. అంతేకాకుండా కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. ఈ నెల 16న ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు 108లో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మహిళపై హత్యాయత్నం

కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ మండలంలోని కోయవాగు గ్రామానికి చెందిన దుర్గం శారదపై హత్యాయత్నం చేసిన మాల్కార్ శ్రావణ్‌పై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు కాగజ్‌నగర్ రూరల్ ఎస్సై సోనియా తెలిపారు. అంబేద్కర్ చౌరస్తాలో కిరాణాషాపు నడుపుతున్న శారదను సిగరేట్ కావాలని అడుగగా పూజ చేస్తున్నా కాసేపు ఆగాలని కోరింది. తర్వాత ఇస్తానని చెప్పినప్పటికీ మద్యం మత్తులో కిరాణాషాపులోకి వచ్చి కత్తితో దాడి చేసేందుకు యత్నించాడని బాధితురాలు పేర్కొంది. శ్రావణ్‌పై గతంలో కూడా కేసులు ఉన్నాయని ఎస్సై తెలిపారు.

అథ్లెటిక్స్ కోచ్ శిక్షణకు ఎంపిక

బెల్లంపల్లి: పట్టణంలోని కాసిపేట సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల విద్యాలయంలో పీఈటీగా విధులు నిర్వర్తిస్తున్న సంతోశ్ జాతీయ స్పోర్ట్ అథారిటీ అథ్లెటిక్స్ కోచ్ శిక్షణకు ఎంపికయ్యాడు. కోటపల్లి మండలం నాగంపేటకు చెందిన సల్పాల సంతోశ్ ఇటీవల ఆన్‌లైన్‌లో నిర్వహించిన పరీక్షలో ప్రతిభ కనబర్చి బెంగళూర్‌లో నిర్వహించనున్న కోచ్ శిక్షణకు ఎంపికయ్యాడు.

అంగన్‌వాడీ కేంద్రం సందర్శన

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలంలోని వేంపల్లి మోడల్ అంగన్‌వాడీ కేంద్రాన్ని శుక్రవారం శిక్షణ కలెక్టర్ గౌతమి సందర్శించారు. ఈ సందర్భంగా చిన్నారులను పలు ప్రశ్నలు అడగగా సమాధానం ఇచ్చిన తీరుపై ఆనందం వ్యక్తం చేశారు. వారికి చాక్లెట్లు, బిస్కట్లు అందించారు. అనంతరం ఎల్‌ఈడీ టీవీ, మొబైల్ ద్వారా నేర్చుకుంటున్న పాఠాల వివరాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట సర్పంచ్ వోలపు శారద, ఎంపీడీఓ అబ్దుల్‌హై, పంచాయతీ కార్యదర్శి ప్రతిభ, కారోబార్ తిరుపతి, అంగన్‌వాడీ టీచర్ అరుణకుమారి, ఆయా కవిత, తదితరులు ఉన్నారు.


చిన్నారులతో శిక్షణ కలెక్టర్ గౌతమి

న్యాకంజర్ సమీపంలో భారీ కొండచిలువలు

- హతమార్చిన రైతులు

లక్ష్మణచాంద: మండలంలోని న్యాకంజర్ గ్రామ సమీపంలో నాలుగు భారీ కొండ చిలువలను రైతులు హతమార్చారు. మండల కేంద్రానికి చెందిన రైతులు న్యాకంజర్ సమీపంలోని తమ చేన్లకు వెళ్లే క్రమంలో సరస్వతి కాలువ సమీపంలో ఆగారు. ఆ సమయంలో చెట్ల పొదల నుంచి భారీగా శబ్దం వచ్చింది. అటువైపు వెళ్లి చూడగా అందులో భారీ కొండ చిలువలు కనిపించాయి. షాక్‌తిన్న యువ రైతులు లక్ష్మణచాంద, న్యాకంజర్ గ్రామాల ప్రజలకు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చారు. రెండు గ్రామాల రైతులు అక్కడకు చేరుకుని నాలుగు కొండచిలువలున్నట్లు గుర్తించి బండరాళ్లు, కర్రలతో కొట్టి హతమార్చారు. దీంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు.


రైతులు హతమార్చిన కొండచిలువలు

మహిళ ప్రాణాలు కాపాడిన 108

ఖానాపూర్: మండలంలోని సింగాపూర్ తండాకు చెందిన రాముల లక్ష్మి గురువారం సాయంత్రం ఇంటి వద్ద స్పృహతప్పి పడిపోయింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేరు. కూలీ పనుల నుంచి ఇంటికి చేరుకున్న బంధువులు లక్ష్మిని చూసి స్పృహ తప్పి పడిపోయి ఉందని భావించారు. 108కు సమాచారం ఇవ్వగా రాత్రి 8.30 ప్రాంతంలో అక్కడికి చేరుకున్న మామడ 108 సిబ్బంది శేఖర్, రాజన్న మహిళ పరిస్థితి గమనించారు. అప్పటికే ప్రాణం పోయిందేమోనని అక్కడున్న గ్రామస్తులంతా చర్చించుకుంటున్నారు. వెంటనే పేషెంట్‌ను ఎగ్జామినేషన్ చేయగా, పల్స్ వీక్ ఉండడంతోపాటు జీఆర్‌బీఎస్–7 ఉండి (షుగర్ లెవల్స్ పడిపోయాయి), బీపీ 70–60 మధ్య ఉంది. కోమాలో ఉందని తెలిపారు. పేషెంట్ పరిస్థితి క్రిటికల్‌గా ఉందని, డాక్టర్ సలహామేరకు వెంటనే డీ–25 గ్లూకోజ్, ఆర్‌ఎల్, ఆక్సిజన్ పెట్టి తీసుకువెళ్లే క్రమంలో మామడ వరకు వెళ్లేలోపు పేషెంట్ స్పృహలోకి వచ్చిందని 108 సిబ్బంది తెలిపారు. అంబులెన్స్ లేకుంటే మహిళ బతికేది కాదని, కుటుంబీకులు కూడా హర్షం వ్యక్తంచేశారు.